


# తెగని తీగెలు

రచన :
శ్రీమతి గుత్తుర్తి ఈశ్వరీ సోమేశ్.

**(4)**

(గత సంచిక తరువాయి)

"శ్రీధర్ యీపాటికి చనిపోయేవుంటాడ్రా!"

"చావకపోతే ఎండ్రినంటే మాటలేంటి!"

"గ్రామగ్రహాలు తలచుకోవడం - వాడుచావక పోడనుకున్నా!"

"మనం బలవంతంగా తీసుకొచ్చాం!"

"అదంతా గ్రామగ్రహాలు ప్లానేగదా! మనకేం పరవాలేదు. మనమీదకురాకుండా వాళ్ళే చూసుకుంటారు."

శ్రీధర్, వాళ్ళ మాటలు వింటుంటే తేనె పూసిన కత్తుల్లా తనతో తిరుగుతూ వాని తలంచాడు. నన్ను యీత్రోవన తీసుకురావడానికి కారణ మిదన్న మాట! ఎవరిని నమ్మాలో - ఎవరిని నమ్మకూడదో తనకే అర్థం కాలేదు. అదీ ఒకందుకు మంచిదే అనుకున్నాడు.

శ్రీధర్ సకిలించాడు.

పొదల మాటునుండి వాళ్ళొచ్చారు. శ్రీధర్ ను చూసి, ఆశ్చర్యపోయారు.

"ఏం బ్రతికొచ్చావని భయపడుతున్నారా?"

"అబ్బే! లేదు," యేకకంఠంగా పలికారంతా.

"నేను ఎండ్రిన్ త్రాగినా చావను తెలుసా కావాలంటే పందెమేయండి?"

"అమ్మబాబోయ్ ఆలాంటి పందాలకు పోందిగం!"

♦ ♦ ♦

శ్రీధర్ కాలేజినుండి కాలికారియర్, పుస్తకాలతో సాయంత్రానికి యింటికి చేరుకున్నాడు.

రత్నమ్మకు తుయదగ్గు విపరీతంగా వచ్చి గుబగుబగా శ్లేష్మంతోపాటు రక్తంజీరలు పడిపోతున్నాయి. పాపం శ్రీధర్ అలాగే సేవచేస్తున్నాడు. ఆమె ఉమ్మిన ఉమ్మంతా నీళ్ళతో కడుగుతున్నాడు. రత్నమ్మ విపరీతంగా దగ్గుతూ ఊపిరి అందుకోలేక ఆవేశంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతోంది. కళ్ళు పెద్దవిచేసి, తెల్లపాపలు పైకబికినట్లుగా ప్రాణాలు వదిలేసినంతగా బాధపడుతోంది.

తల్లిపడే అవస్థను చూసి, శ్రీధర్ కు కళ్ళు చెమ్మగిల్లాయి. రక్తంజీరలు చూసి, అనుమానం కలుగుతుంది,

తల్లిని రక్షించుకుందామనుంది. కాని–, తగినంత డబ్బు స్తోమతు లేక నీరు గారిపోతున్నాడు.

వరండాలో లైటు వెలిగింది. తలుపులు తెరచుకున్నాయి.

డాక్టర్ బయటకొస్తూ–, "ఎవరూ...?" అడిగాడు.

"నేనండి, శ్రీధర్ ని–!"

"ఒహో...నువ్వా! మీ మదర్ కి సీరియస్ గావుందంటావు! అవునా? వుంటుంది. వుండదుమరీ, మీ అమ్మగారి వద్దకు నేనెన్నోసార్లు వచ్చి పరీక్షించాను. అది క్షయ వ్యాధి ఉద్రుత రూపం దాల్చింది. ఆ జబ్బు మూడువేలకు పైగా ఖర్చు పెడితేగాని మామూలుమనిషి కాదని నేనెప్పుడో చెప్పాను. ఇప్పుడు బాగా విషమించి వుంటుంది. యెన్నాళ్ళవాడినా తక్కువఖరీదు మాత్రలే వ్రాసిమ్మన్నావు కాని, సరియైన యింజక్షన్లు యిప్పించలేదు. ఏవరేం చేస్తాం? డబ్బు సర్దుకోలేనంటావు. ఇప్పుడు మరీ ఖర్చువుంటుంది. మందుల్లేంది! నేను రావడం అనవసరం వెళ్ళి ఆలోచించు" అని, లోనికెళ్ళి తలుపు వేసుకున్నాడు, వరండాలో లైటారిపోయింది.

శ్రీధర్ చుట్టూ చీకటిచేరింది. నిరాశగా మెట్లు దిగాడు, బరువుగా అంతడబ్బు నేనెలా సంపాదించగలను? అమ్మనెలా రక్షించుకోగలను? అనే తర్జన భర్జనతో మనసు విసిగిపోయి, కాళ్ళు తేలిపోతున్నాయి. నెమ్మదిగా మెయిన్ రోడ్డు సెంటర్ కు చేరుకున్నాడు.

◆ ◆ ◆

–క్రితం ఎప్పుడూ కాలేజిలో నిర్మలకు కనిపించకుండా తిరిగాడు. ఆరోజు మాత్రం నిర్మలకోసం గేటు దగ్గర నిల్చున్నాడు.

నిర్మల కనిపించింది. విచారంతో కూడిన శ్రీధర్ ను చూసి, "అదేం శ్రీధర్ అలావున్నావ్?" అడిగింది.

"నిర్మలా! నీతో కొన్ని విషయాలు ప్రశాంతంగా మాట్లాడాలి–?"

"పద వెళదాం!"

ఇద్దరూ విజయా గార్డెన్స్ పార్కులోకి ప్రవేశించారు. సిమెంటు సోఫాపై కూర్చున్నారు. "శ్రీధర్! మా మీద యింకా కోపంపోలేదా–?" అడిగింది నిర్మల.

"ఎవరిమీద కోపగించితే ఎవరూరుకుంటారు! కోపం చూపించేందుకు నా అనేవాళ్ళు ఎవరున్నారు?"

నిర్మల కనుకొనల్లో నీళ్ళు తొణికసలాడాయి.

"అదేం నిర్మలా అంతలోనె బాధపడతావేం?"

"నేను... నేను..."

"ఆఁ, నువ్వు–"

"నీభార్యను కాకూడదా?" అంటూ మొహం సిగ్గుతో ప్రక్కకు త్రిప్పింది.

"నిర్మలా...!"

యేం...? అన్నట్టుగా చూసింది.

"పొరపాటు పడుతున్నావు నిర్మలా! మీ నాన్నగారి మనస్తత్వంలో నేనొక నలుసుతో సమానంగా భావించేటప్పుడు"

"అలా యెప్పుడూ అనకు శ్రీధర్! అప్పటికోపంతో అలాచేసి తర్వాత యెలా క్రుంగిపోయారో నీకేం తెలుసు? మిమ్మల్ని కలుసుందామని ప్రయత్నిస్తున్నారు. కాని, అభిమానం అడ్డొచ్చి ఆగిపోతున్నారు."

"పాస్టీజ్ పాస్ట్!

◆ ◆ ◆

–ఇంట్లో రత్నమ్మ కొనప్రాణాలతో కొడుకు కోసం కళ్ళు పెద్దవి చేసి చూస్తుంది. ఆమె ప్రక్కనే నిర్మల, జానకమ్మలు అప్పుడే వచ్చి కూర్చొని ఏడుస్తున్నారు. జగన్నాథంగారు చెల్లి మొహంలోకి చూస్తూ తువ్వాలు కొనతో కళ్ళొత్తుకుంటూ; వచ్చిన శ్రీధర్ ను చూసి యేం చెప్పాలో–యెలా చెప్పాలో తెలియక తికమకతో చూసారు.

"అమ్మా...!" పెద్దగావుకేక వేస్తూ శ్రీధర్ అమ్మా! నిన్ను బ్రతికించుకుంటానమ్మా! అమ్మా... అమ్మా...!" అంటూ కన్నీరు కార్చాడు.

రత్నమ్మ మూగగా శ్రీధర్ వంక చూస్తూ,– "బాబూ! నేనెలా బ్రతుకగలనని నమ్మకముంది నీకు? కళ్ళలో ప్రాణముంచుకొని నీ కోసం ఎదురు చూస్తున్నాను. నేను నా అన్నకు విరోధినై భర్త బ్రతికివుండగా ఆత్మీయత పొందలేక పోయాను. మాలో 'తెగని తీగలుగా' అనురాగాలు పెరుగుతున్నాయి. పట్టుదలలు మాత్రం, ఎదుటి వ్యక్తి పూర్తిగా పతనమయ్యేవరకు కలుసుకోలేరు. అలా నా జీవితంలో రెండుసార్లు జరిగింది. అయినా, ఎన్ని అఘాయిత్యాలకు దిగజారినా యీ రక్తసంబంధం 'తెగనితీగలుగా' చిగురిస్తూనే వుంటుంది." అని, జగన్నాథం వంక దీనంగా చూసి–, "అన్నయ్యా! నేను బ్రతుకుండగా నాకోర్కె తీర్చక పోతే పోయింది. నేను పోయింతర్వాతైనా!" అంటూ నిర్మల–శ్రీధర్ చేతులు కలిపి, "వివాహం జరిపించు అన్నయ్యా...!" ఆనంద బాష్పాలు రాల్చుతూ జీవం విడిచింది.

(సంపూర్ణం)